క్లుప్తంగా

బాలదుర్గాదేవికి సారె సమర్పణ



శ్రీబాలదుర్గాదేవికి సమర్పించిన సారె

ఏలూరు రూరల్ : గురువారం ఏలూరు కార్పొరేషన్ పరిధి ఆదర్శనగర్‌లోని శ్రీబాలదుర్గాదేవి అమ్మవారికి భక్తులు ఆషాడమాసం సందర్భంగా బూరెలు, గారెలు, అరిసెలు, పులిహోర, పెసరపప్పు, చలవిడి, దద్దోజనంతో పాటు లడ్డు, కాజా, మైసూర్‌పాక్, గులాబ్‌జామ్, జిలేబీ, చెక్కరతో చేసిన గవ్వలు, పొంగలి, పాయాసం తదితర సుమారు 100 రకాల పిండి వంటలతో కూడిన సారె సమర్పించారు. కొందరు మహిళలు చీరె, గాజులు, పసుపు, కుంకుమ, పండ్లు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. ఉదయం 8 గంటల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో అమ్మవారిని దర్శించుకున్నారు. ఆలయ కమిటీ సభ్యులు అమ్మవారిని సర్వాంగ సుందరంగా అలంకరించారు.

బెంచీలు ఏర్పాటుచేసిన సర్పంచ్



బెంచీలు ఏర్పాటు చేసిన సర్పంచ్

దెందులూరు : ఏలూరు రూరల్ మండలం కోటేశ్వరదుర్గాపురం గ్రామ సర్పంచ్, వైఎస్సార్ సీపీ సీనియర్ నేత వల్లి లక్ష్మి దుర్గా నారాయణ రావు తన సొంత ఖర్చుతో గ్రామంలో సిమెంట్ బెంచీలను ఏర్పాటు చేశారు. గ్రామస్తులు ప్రయాణికులు పాదచారులు కూర్చోవడానికి అనువుగా ఉండేందుకు బెంచీలను ఏర్పాటు చేశామని సర్పంచ్ లక్ష్మీదుర్గా నారాయణరావు తెలిపారు.

పాత పెన్షన్ స్కీమ్ పోరాటానికి మద్దతు

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): ప్రభుత్వ నోటిఫికేషన్ జారీ అయిన అనంతరం ఉద్యోగాల్లో ప్రవేశించిన ఉపాధ్యాయులు, ఉద్యోగులకు పాత పెన్షన్ పథకం వర్తింప చేయాలని చేస్తున్న పోరాటానికి ఏపీటీఎఫ్ 1938 సంపూర్ణ మద్దతు ప్రకటిస్తోందని సంఘ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఈ.రామ్మోహనరావు, జి.మోహన్ తెలిపారు. ఈనెల 18న ఏలూరులో నిర్వహించే నిరసన కార్యక్రమానికి ఏపీటీఎఫ్ 1938 శ్రేణులంతా హాజరై విజయవంతం చేయాలని ఆ సంఘ రాష్ట్ర అకాడమిక్ కన్వీనర్ జి.కృష్ణ పేర్కొన్నారు.

గోవుల (తో) కష్టం

- రహదారులే వాటికి బందిల దొడ్లు
- ప్రమాదాల బారిన పడుతున్న వైనం
- ప్లాస్టిక్ వ్యర్థాలు తిని అనారోగ్యం పాలు
- యజమానులపై చర్యలు శూన్యం

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): నగరంలో విచ్చలవిడిగా సంచరిస్తున్న గోవులతో నగర ప్రజలు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. పగలంతా నివాసిత ప్రాంతాల్లో ఆహారం కోసం ఇళ్ల ఎదుట నిలబడి ఉండడం, వాటికి ఏమైనా పెడితే గానీ అక్కడి నుంచి కదలక పోవడం వంటివి ప్రజలు నిత్యం ఎదుర్కొంటున్న సమస్యలు. అలాగే వీధుల్లోని చెత్తకుప్పలవద్దకు చేరుకుని అక్కడ ప్రజలు పడేసిన ఆహార వ్యర్థాలను వాటితో పాటే ప్లాస్టిక్ కవర్లను తింటూ గోవులు తీవ్ర అనారోగ్యం పాలవుతున్నాయి. గోవుల యజమానులు వీటిని రోడ్లపై విడిచిపెట్టి తమవి కావన్నట్టు వ్యవహరిస్తున్నారు. ఉదయం, సాయంత్రం ఇళ్లకు వచ్చిన గోవుల నుంచి పాలను పిండుకుని తిరిగి రోడ్లపై ఒదిలేయడం యజమానులకు రివాజుగా మారింది. గోవులు వీధుల్లో ఉదయం నుంచే సంచరిస్తూ ఉండడంతో పాఠశాలలు, కళాశాలలకు వెళ్లే విద్యార్థులకు ఆటంకంగా మారుతున్నాయి. ఒక్కోసారి ప్రజలను పొడిచే ప్రయత్నాలు చేయడం, అప్రమత్తంగా లేకపోతే ప్రజలను కుమ్మడం కూడా అక్కడక్కడా జరుగుతూనే ఉంది.

రోడ్లపై వదిలేస్తున్నారు

సాధారణంగా పెంపకందారులు గోవుల ఆహార అవసరాలు తీర్చి, పాలు పిండుకుని, మేతకు పొలాల్లో ఒదలుతూ ఉంటారు. అయితే నగరం సమీపంలో పొలాలు ఉండక పోవడంతో వాటి యజమానులు వాటి ఆహారపు అవసరాలు తీర్చకుండా వీధుల్లోకి ఒదిలి వేస్తుండడమే నగర ప్రజలకు సమస్యగా మారింది. ఉదయం వీధుల్లోకి ఒదిలేసినా కనీసం రాత్రి సమయాల్లోనైనా వాటికి విశ్రాంతి తీసుకోవడానికి అవసరమైన ఏర్పాట్లు చేయకుండా వీధుల్లోనే ఒదిలేస్తున్నారు. కనీసం రాత్రి వేళల్లోనైనా గోవులు ఇంటికి వచ్చేలా ఏర్పాటు చేసుకుని రక్షణ కల్పించాలని యజమానులకు పలువురు సూచిస్తున్నారు.

ప్లాస్టిక్ వ్యర్థాలతో అనారోగ్యం

గోవులు వీధుల్లో చెత్తకుప్పల వద్దనే ఆహారాన్ని వెదుక్కుంటున్నాయి. ప్రజలు వినియోగించి పడేసిన ప్లాస్టిక్ వ్యర్థాలు తినడంతో గోవుల జీర్ణప్రక్రియ కూడా దెబ్బతిని, ఒక్కొక్కసారి పొట్టలు ఉబ్బిపోయి ప్రాణాపాయ స్థితికి చేరుకుంటున్నాయి. గతంలో నగరంలో పలుచోట్ల అతికించే వాల్ పోస్టర్లు తింటూ కడుపునింపుకునే గోవులకు ప్రస్తుతం నగరంలో ఎక్కడో గానీ వాల్ పోస్టర్లు కనిపించకపోవడంతో కడుపు నింపుకోవడానికి ఏది దొరికితే అది తినేసి ప్రాణాల మీదకు తెచ్చుకుంటున్నాయి. పగటి పూట నగరానికి దూరంగా శివారు ప్రాంతాల్లో ఉన్న ఖాళీ స్థలాల్లోకి గోవులను తరలిస్తే వాటికి ఆరోగ్యకరమైన ఆహారం లభిస్తుందని జంతుప్రేమికులు సూచిస్తున్నారు.



ఏలూరులోని ఒక వీధిలో రహదారిపై ఉన్న గోవులు

చర్యలు శూన్యం

ప్రజలు ప్రమాదాల బారిన పడడానికి, గాయాల పాలవడానికి కారణమౌతున్నా గోవుల యజమానులపై అధికారులు చర్యలు తీసుకుంటున్న దాఖలాలు లేవు. కొన్ని సందర్భాల్లో గోవులు గాయపడుతున్నా వాటికి చికిత్స చేయించడానికి కూడా వాటి యజమానులు ముందుకురాకపోవడం విమర్శలకు తావిస్తోంది. గోవులను పాల అవసరాలకు వాడుకుని వాటిని నిర్లక్ష్యంగా ఒదిలివేయడంపై ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అటువంటి యజమానులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు.

రక్షణ కల్పించాలి



నగరంలో గోవుల కారణంగా ప్రజలకు రక్షణ కరువైంది. గోవులు రహదారులపై ఉండడం వల్ల రాకపోకల సమస్యలంలో ప్రమాదాలు సంభవిస్తున్నాయి. కొన్ని సందర్భాల్లో రోడ్లపై ఉన్న గోవులను వాహనాలు ఢీకొని గాయాలపాలౌతున్నాయి. కొన్ని గోవులకు నగరంలోని గో సంరక్షణ సమితిలో ఆశ్రయం కల్పిస్తున్నప్పటికీ అన్నింటినీ ఆదరించే ఆర్థిక పరిస్థితి సమితికి లేని కారణంగా గోవుల సంరక్షణకు అధికారులు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలి.

– కె.రమేష్ బాబు, సామాజిక కార్యకర్త

రాత్రి సమయాల్లో ప్రమాదాలు

రాత్రి సమయాల్లో గోవులు గుంపులుగా చేరుకుని ప్రధాన రహదారికి అడ్డంగా విశ్రమిస్తున్నాయి. రాత్రి సమయంలో హైదరాబాద్, విశాఖపట్నం వంటి దూరప్రాంతాలకు ఆర్టీసీ, ప్రైవేట్ ట్రావెల్స్ బస్సులు అత్యంత వేగంగా వెళుతూ ఉంటాయి. ఆ సమయంలో గోవుల వద్ద షడెన్ బ్రేకు వేయడంతో ప్రయాణికులు గాయాలపాలవుతున్న ఘటనలు ఉన్నాయి. ఒక్కోసారి బస్సులు గోవులను ఢీకొనడంతో అవి తీవ్రంగా గాయపడుతున్నాయి. గాయపడిన గోవులకు కనీసం వైద్య సహాయం అందించే నాథుడు ఉండడంలేదు. కొందరు సామాజిక సేవా కార్యకర్తల దృష్టికి గోవులు గాయపడిన విషయాలను తీసుకువెళితే వారు వచ్చి ప్రాథమిక చికిత్స అందించి అనంతరం వైద్యులకు సమాచారం ఇస్తుండడం కొంత ఉపశమనం కలిగించే విషయంగా చెప్పవచ్చు.



జెడ్పీ కార్యాలయం వద్ద రోడ్డుపై అర్ధరాత్రి విశ్రమిస్తున్న గోవులు

ఎస్సైపై చర్యలు తీసుకోవాలి

ఏలూరు (టూటౌన్): విచారణ పేరుతో గిరిజనులపై దాడి చేసిన బుట్టాయగూడెం ఎస్సైపై కఠిన చర్యలు తీసుకోవాలని సీపీఎం ఏలూరు జిల్లా కమిటీ తరఫున ఆ పార్టీ జిల్లా కార్యదర్శి ఎ.రవి గురువారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. బుట్టాయగూడెం మండలం వీరన్నపాలెం గ్రామానికి చెందిన గుజ్జు మహేంద్రపై అదే గ్రామానికి చెందిన కొందరు మహిళ విషయమై ఫిర్యాదు చేయడంతో విచారణ పేరుతో ఆ యువకుడి పై, అతని తండ్రి గుజ్జు లక్ష్మణుడుపై, సోదరుడు రాజుపై విచక్షణారహితంగా ఎస్సై దాడి చేసి గాయపరచడాన్ని ఖండించారు. గిరిజనుడు తప్పు చేసి ఉంటే చట్ట ప్రకారం కేసు నమోదు చేసి విచారణ చేయాలే తప్ప చట్టాన్ని చేతుల్లో తీసుకొని విచక్షణారహితంగా దాడి చేయడం తగదన్నారు. విచక్షణారహితంగా ప్రవర్తించిన ఎస్సైపై పోలీసు ఉన్నతాధికారులు తక్షణమే చర్యలు తీసుకోవాలని రవి కోరారు.

అధ్యాపకుల రెన్యువల్‌కు దరఖాస్తుల ఆహ్వానం

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): కళాశాల విద్యాశాఖ, మంగళగిరి, ప్రాంతీయ కళాశాల విద్యా సంచాలకులు, రాజమహేంద్రవరం ఉత్తర్వుల మేరకు, 2025 – 26 విద్యా సంవత్సరానికి ఏలూరు జిల్లా పరిధిలో ఈ ఏడాది ఏప్రిల్ 30వ తేదీ నాటికి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో పని చేస్తున్న ఒప్పంద అధ్యాపకుల రెన్యువల్ కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు ఏలూరు జిల్లా ఐడీ కళాశాల (ప్రభుత్వ డిగ్రీ కళాశాల, ఏలూరు) ప్రిన్సిపాల్ జి.గిరిబాబు ఒక ప్రకటనలో తెలిపారు. గత విద్యా సంవత్సరం ఏప్రిల్ 30 వరకు పనిచేసిన ఒప్పంద అధ్యాపకులు తమ రెన్యువల్ దరఖాస్తుని ఆయా కళాశాల ప్రిన్సిపాల్స్‌కు ఈ నెల 19వ తేదీ సాయంత్రం లోపు అందజేయాలని పేర్కొన్నారు.

చట్టాలపై మరింత అవగాహన అవసరం



సదస్సులో మాట్లాడుతున్న రత్నప్రసాద్

ఏలూరు (టూటౌన్): ప్యానల్ న్యాయవాదులు చట్టాలపైన మరింత అవగాహన పెంచుకోవాలని, కక్షిదారులకు నాణ్యమైన న్యాయ సహాయం అందించాలని ఉమ్మడి జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి కె.రత్నప్రసాదు సూచించారు. రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ అమరావతి వారి ఆదేశాల మేరకు ఆయన గురువారం జిల్లా న్యాయ సేవాధికార సంస్థ భవనంలో ప్యానల్ న్యాయవాదులతో అవగాహన సదస్సు నిర్వహించారు. జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ద్వారా ఉచితంగా వాదించే కేసుల్లో న్యాయవాదులకు మారుతున్న చట్టాలను ఎప్పటికప్పుడు వివిధ కోర్టులు ఇచ్చే తీర్పులపైనా, వాటి ద్వారా అనుసరించాల్సిన విధి విధానాలపైనా న్యాయవాదులకు అవగాహన కల్పించామన్నారు. కార్యక్రమంలో చీఫ్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ పీవీఎన్ మునీశ్వర రావు, ప్యానల్ లాయర్లు, తదితరులు పాల్గొన్నారు.

బీసీలకు 52 శాతం రిజర్వేషన్లు ఇవ్వాలి



ములకాల సత్యనారాయణ

ఏలూరు (టూటౌన్): దేశ జనాభాలో సగానికి పైగా అంటే సుమారు 52 శాతం జనాభా బీసీలే ఉన్నారని ఆల్ ఇండియా బహుజన్ సమాజ్ పార్టీ (ఏఐబీఎస్పీ) జిల్లా అధ్యక్షుడు ములకాల సత్యనారాయణ తెలిపారు. బీసీ జనాభా శాతానికి అనుగుణంగా బీసీలకు 52 శాతం రిజర్వేషన్లు అమలు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. స్థానిక ఎన్ఆర్‌పేటలో గురువారం ఆయన విలేకర్లతో మాట్లాడారు. దేశంలోనూ, రాష్ట్రంలోనూ విద్యా, ఉద్యోగాలు, "సంక్షేమ పథకాల్లో 52 శాతం అమలు చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర అసెంబ్లీలోని 175 సీట్లలో 40 మంది బీసీ ఎమ్మెల్యేలు మాత్రమే ఉన్నారన్నారు. బీసీ జనాభా లెక్కల ప్రకారం 90 మంది బీసీ ఎమ్మెల్యేలు ఉండాలని తెలిపారు. కేవలం రెండు కులాలకు సంబంధించి 10 శాతంలోపు జనాభా ఉన్న వారు 67 మంది ఎమ్మెల్యేలు ఉన్నారని వివరించారు. బీసీలు రాజ్యాధికారం సాధించిన నాడే స్వాతంత్ర్య ఫలాలు వారికి పూర్తిస్థాయిలో అందుతాయనే అభిప్రాయం వ్యక్తం చేశారు.

వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడితో నేతల భేటీ



వైఎస్సార్ సీపీ జిల్లా నాగేశ్వరరావును కలిసిన జేపీ, ముఖ్య నేతలు

ఏలూరు టౌన్: వైఎస్సార్ సీపీ ఏలూరు జిల్లా అధ్యక్షుడు దూలం నాగేశ్వరరావును ఏలూరు నియోజకవర్గం సమన్వయకర్త మామిళ్ళపల్లి జయప్రకాష్, పార్టీ ముఖ్యనేతలు మర్యాదపూర్వకంగా కలిశారు. ఇటీవల స్వల్ప అస్వస్థతకు గురికావటంతో పూర్తిగా కోలుకున్న నాగేశ్వరరావును పరామర్శించారు. వైఎస్సార్ సీపీ అధ్యక్షులు వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు ఏలూరు జిల్లాలోని చేపడుతున్న బాబు ష్యూరిటీ – మోసం గ్యారంటీ కార్యక్రమాలు, ప్రజల నుంచి వస్తున్న స్పందనపై చర్చించారు. కూటమి ప్రభుత్వం హయాంలో ప్రజల సమస్యలపై అవగాహన కల్పిస్తూ ముందుకెళ్లాలని సూచించారు. కార్యక్రమంలో పార్టీ ఏలూరు నగర అధ్యక్షులు గుడిదేశి శ్రీనివాసరావు, ఎస్సీ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నూకపెయ్యి సుధీర్‌బాబు, బీసీ సెల్ జిల్లా అధ్యక్షులు నెరుసు చిరంజీవి, జిల్లా అధికార ప్రతినిధి మున్నుల జాన్‌గురునాథ్, నగర బీసీ సెల్ అధ్యక్షులు కిలాడి దుర్గారావు, వాణిజ్య సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జీఎంఆర్, పార్టీ నేతలు దాసరి రమేష్, యువజన నాయకులు దాలి వెంకటేష్, బసవ, సత్యనారాయణ తదితరులు ఉన్నారు.

ఆర్టీసీ సమాచారం

ఏలూరు ఆర్టీసీ డిపో నుంచి దూరప్రాంతాలకు వెళ్లే బస్సుల సమయాలు, రిజర్వేషన్ వివరాలు

ఏసీ బస్సులు..

బస్సు రూటు	సమయం	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు –బీహెచ్‌ఈఎల్ (ఇంద్ర)	21.00	34
ఏలూరు – జీడిమెట్ల (ఈసీఐఎల్) (ఇంద్ర)	21.30	31
ఏలూరు –బీహెచ్‌ఈఎల్ (అమరావతి)	22.00	41
ఏలూరు – బీహెచ్‌ఈఎల్ (స్టార్ లైనర్ నాన్‌ఏసీ స్లీపర్)	22.30	26
ఏలూరు – అమరావతి (ఇంద్ర)	19.00	రద్దు

సూపర్ లగ్జరీ

బస్సు రూటు	సమయం	సర్వీస్ నంబర్	అందుబాటులో 22సీట్లు
ఏలూరు –బీహెచ్‌ఈఎల్	21.45	4820	30
ఏలూరు –బీహెచ్‌ఈఎల్	21.15	4822	29
ఏలూరు –బీహెచ్‌ఈఎల్ వయా కే.కోట	19.30	4796	20
ఏలూరు –బీహెచ్‌ఈఎల్ వయా రామచంద్రపురం	10.45	4798	32
ఏలూరు –జీడిమెట్ల వయా ఖమ్మం	21.15	4802	33
ఏలూరు – బీహెచ్‌ఈఎల్ వయా ఖమ్మం	21.00	4804	36
ఏలూరు –ఈసీఐఎల్	22.30	4814	30
ఏలూరు – తిరుపతి	16.00	4830	31

సీఆర్‌రెడ్డి కళాశాలలో విద్యార్థుల రక్తదానం



రక్తదానం చేస్తున్న సీఆర్‌ఆర్ విద్యార్థి

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): స్థానిక సీఆర్‌రెడ్డి కళాశాలలో కళాశాల ఎన్ఎస్ఎస్ యూనిట్ 1, -2, ఎన్‌సీసీ, హెల్త్ సెంటర్ విభాగాలు, ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ ఏలూరు, లయన్స్ క్లబ్ ఆఫ్ హేలాపూరి, రోటరీ క్లబ్‌ల సంయుక్త ఆధ్వర్యంలో గురువారం ఉదయం రక్తదాన శిబిరం నిర్వహించారు. సీఆర్‌ఆర్ కళాశాల విద్యార్థులు 40 యూనిట్ల రక్తాన్ని దానం చేశారు. ఈ సందర్భంగా కళాశాల కరస్పాండెంట్ కేఎస్ విష్ణుమోహన్ రక్తదాన ఆవశ్యకతను విద్యార్థులకు వివరించారు. కార్యక్రమాన్ని విద్యాసంస్థల కార్యదర్శి ఎంబీఎస్‌వీ ప్రసాద్ ప్రారంభించగా, ఏర్పాట్లను ప్రిన్సిపాల్ కేఏ రామరాజు పర్యవేక్షించారు.

చికిత్స పొందుతూ వృద్ధుడు మృతి

ఏలూరు టౌన్: ఏలూరు ఆర్‌ఆర్‌పేట ప్రాంతానికి చెందిన ఒక వృద్ధుడిని మోటారు సైకిల్‌పై వేగంగా వచ్చిన యువకుడు ఢీకొట్టాడు. తీవ్ర గాయాలైన వృద్ధుడిని ఏలూరు జీజీహెచ్‌కు తరలించగా మెరుగైన చికిత్స కోసం విజయవాడ తీసుకెళ్లారు. వృద్ధుడు చికిత్స పొందుతూ గురువారం మృతిచెందాడు. ఏలూరు ఆర్‌ఆర్‌పేటకు చెందిన మెండాల చిన్నా (60) చెత్త ఏరుకుని వాటిని విక్రయిస్తూ జీవనం సాగిస్తున్నాడు. ఈనెల 10తేదీ అర్థరాత్రి వేళ చిన్నా చిన్నా తోపుడు బండి తోసుకుంటూ వెళుతుండగా రైల్వేస్టేషన్ సమీపంలో ఒక యువకుడు చోరీ చేసిన మోటారు సైకిల్‌ను వేగంగా నడుపుతూ కంగారులో ఢీకొట్టాడు. స్థానికులు చిన్నాను ఏలూరు జీజీహెచ్‌కు తరలించగా వైద్యులు చికిత్స అందించారు. ఆరోగ్యస్థితి విషమంగా ఉండడంతో విజయవాడ తరలించగా, పరిస్థితి విషమించి మృతిచెందాడు. ఈ ఘటనపై ఏలూరు టూటౌన్ పోలీసులు కేసు దర్యాప్తు చేపట్టారు.

రైతన్నల నడ్డి విరిచిన కూటమి ప్రభుత్వం

వైఎస్సార్ సీపీ సమన్వయకర్త జయప్రకాష్



బాబూస్ మేనిఫెస్టో రీకాలింగ్ క్యూఆర్ కోడ్ ఫ్లకార్డులు ప్రదర్శిస్తున్న నాయకులు

ఏలూరు టౌన్: రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టిన ఏడాది కాలంలో రైతన్నల నడ్డి విరచారని, రైతులకు పంట సాయం లేకపోగా, కనీసం గిట్టుబాటు ధర కల్పించలేని దుస్థితిలో టీడీపీ ప్రభుత్వం ఉందని వైఎస్సార్ సీపీ ఏలూరు నియోజకవర్గ సమన్వయకర్త మామిళ్ళపల్లి జయప్రకాష్ విమర్శించారు. గురువారం రాత్రి బాబు ష్యూరిటీ మోసం గ్యారంటీ కార్యక్రమాన్ని 21, 22 డివిజన్లలో పార్టీ ఎస్సీ సెల్ ప్రధాన కార్యదర్శి నూకపెయ్యి సుధీర్‌బాబు, 23వ డివిజన్‌లో కుప్పాల ఆంజనేయులు ఆధ్వర్యంలో, 31, 32 డివిజన్లలో వాణిజ్య సెల్ రాష్ట్ర కార్యదర్శి భాస్కర్ల నాగ శంకర్ (బాచి), నగర నాయకులు ప్రత్తిపాటి విక్టర్, కడలి పాండురంగారావు, యక్కల నాని ఆధ్వర్యంలో నిర్వహించారు. బాబూస్ మేనిఫెస్టో రీకాలింగ్ క్యూఆర్ కోడ్ ఫ్లకార్డులను ప్రదర్శించారు. ఈ సందర్భంగా జయప్రకాష్ మాట్లాడుతూ రాష్ట్రంలో ఏ ఒక్క రైతు సంతోషంగా లేరన్నారు. పంట సాయం డబ్బులు వేస్తామని చెప్పిన కూటమి ప్రభుత్వం మోసం చేసిందని, కనీసం రైతన్నల కష్టానికి తగ్గ ఫలితంగా గిట్టుబాటు ధరలు కల్పించలేక చేతులెత్తేశారని విమర్శించారు. మాజీ సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి రైతన్నలను పరామర్శించేందుకు వెళితే అడ్డుకుంటూ, పార్టీ నేతలు, కార్యకర్తలపై అక్రమ కేసులు బనాయిస్తూ తమ విద్వేషపూరిత రాజకీయాన్ని ప్రదర్శిస్తున్నారని మండిపడ్డారు. రైతుల పాలిట శాపంగా కూటమి ప్రభుత్వం తయారైందనీ, రైతు భరోసా సొమ్ములు ఎప్పుడు వేస్తారో చెప్పాలని డిమాండ్ చేశారు. కార్యక్రమాల్లో నాయకులు ఏసుపాదం, బుజ్జమ్మ, మందపాటి కిషోర్, ఫణి, జగదీష్, మోహన్, అనిల్, ఇబ్బ ముసలయ్య, కగ్గ ప్రసాద్, జయరాం, అప్పారావు, మామిళ్ళ రాఘవేంద్రరావు, ఎలిజబెత్, శ్యామల, ఇలియాజ్ పాషా, కొడమంచిలి రవితేజ, ఎల్లాపు రణధీర్, రవి, కిషోర్, గుడిపూడి శ్యామ్, జి.కాజ, కొమ్మోజి బాచి, ఎస్‌కే ఆలీ, ఎస్‌కే బకారి, పార్టీ నగర అధ్యక్షులు గుడిదేశి శ్రీనివాసరావు, జిల్లా అధికార ప్రతినిధి మున్నుల జాన్, బీసీ సెల్ జిల్లా అధ్యక్షులు నెరుసు చిరంజీవి, నగర బీసీ సెల్ అధ్యక్షులు కిలాడి దుర్గారావు, కొల్లిపాక సురేష్, లీగల్ సెల్ నగర అధ్యక్షులు ప్రత్తిపాటి తంబి, వాణిజ్య సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గంటా మోహనరావు (జీఎంఆర్), జనార్ధన్, తులసీ, దాలి వెంకటేష్, బండ్లమూడి సునీల్‌కుమార్, సత్యదేవ్, తులసీ వర్మ, సత్యనారాయణ, ఉమా మహేశ్వరరావు, రమేష్, శ్యామ్, నగర నాయకులు, స్థానిక ప్రజలు ఉన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న సమన్వయకర్త జయప్రకాష్

ఎస్సీల ఐక్యతతోనే రాజ్యాధికారం సాధ్యం



సభలో మాట్లాడుతున్న మెండెం సంతోష్ కుమార్

ఏలూరు (టూటౌన్): ఎస్సీలంతా ఐక్యంగా ఒకేతాటిపై నడిచిన నాడే హత్యలు, హత్యాచారాలు వంటి ఘటనలను నిరోధించవచ్చని వక్తలు పేర్కొన్నారు. స్థానిక ఇండోర్ స్టేడియం ఎదురుగా ఉన్న లేడీస్ క్లబ్‌లో ఆల్ ఇండియా అంబేడ్కర్ యువజన సంఘం, రాజ్యాంగ పరిషత్ ఆధ్వర్యంలో 40వ కారంచేడు మృతవీరుల సంస్మరణ సభ గురువారం ఆల్ ఇండియా అంబేడ్కర్ యువజన సంఘం జాతీయ ప్రధాన కార్యదర్శి మెండెం సంతోష్ కుమార్ అధ్యక్షతన నిర్వహించారు. ప్రధాన వక్తగా డాక్టర్ ఎస్ఏడీ పాలు మాట్లాడారు. ఎస్సీలపై జరుగుతున్న అన్యాయాలను రాజ్యాధికారంతోనే అడ్డుకోగలమని అన్నారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఇచ్చిన మాస్టర్ కీని అర్థం చేసుకుని ప్రతి ఒక్కరు కృషి చేయాలన్నారు. సంతోష్ కుమార్ మాట్లాడుతూ రాష్ట్రంలో ఎస్సీలు, ఎస్సీ క్రైస్తవులపై దాడులను అరికట్టాల్సిన బాధ్యత ప్రభుత్వాలపై ఉందన్నారు. నాడు కారంచేడు ఘటన టీడీపీ హయాంలోనే జరిగిందని గుర్తుచేశారు. కారంచేడు ఉద్యమం 1989 ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ యాక్ట్ రావడానికి మూలమైందన్నారు. నేతల రమేష్, ఎన్జీవో సాగర్ చాగంటి సంజీవ్ మాట్లాడుతూ ఎస్సీల్లో ఉన్న మాల, మాదిగలు ఐక్యమైతేనే రాజ్యాధికారం రావడం సులువవుతుందని తెలిపారు. అలుగు ఆనంద్ శేఖర్ కందుల రమేష్, మేతర అజయ్ బాబు, దేవరకొండ వెంకటేశ్వర్లు మాట్లాడారు. నూకపెయ్యి కార్తీక్, కిరణ్ దాసరి శ్యామ్, తోటకూర కిషోర్, మహిళా సంఘం నాయకులు వాణి, స్వరూప, నమ్మిన లక్ష్మి, యువజన సంఘం నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ఆ పోరాటానికి సంఘీభావం తెలియజేద్దాం

దేశంలో సామాజిక న్యాయ పోరాటానికి సంఘీభావం తెలియజేద్దామని సీపీఐ (ఎంఎల్) న్యూ డెమోక్రసీ రాష్ట్ర నాయకుడు యు.వెంకటేశ్వరరావు (యూవీ), జిల్లా నాయకులు బద్దా వెంకట్రావు ప్రజలకు పిలుపునిచ్చినారు. కారంచేడు నరమేధానికి 40 ఏళ్లు కావస్తున్న సందర్భంగా ఏలూరు వన్ టౌన్ ఏరియా మూసేసిన కల్పన థియేటర్ సినిమా హాల్ వద్ద నుంచి ఎస్ఎస్ మార్కెట్ వరకు ర్యాలీ నిర్వహించారు. అక్కడ ఐఎఫ్‌టీయూ ఏలూరు నగర సహాయ కార్యదర్శి ముంగం అప్పారావు అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో యూవీ మాట్లాడారు. 1985 జూలై 17న టీడీపీ హయాంలో చేంచు రామయ్య నాయకత్వంలో పథకం ప్రకారం ఆరుగురు దళితులను అమానుష్యంగా చంపేశారని గుర్తుచేశారు. నేటికీ దేశంలో దళితులపై దాడులు చేస్తూనే ఉన్నారని తెలిపారు. సీపీఐ (ఎంఎల్) న్యూ డెమోక్రసీ జిల్లా నాయకులు బద్దా వెంకట్రావు మాట్లాడారు. మీసాల వెంకటరమణ, బాడిత బోయిన వీరభద్రం తదితరులు పాల్గొన్నారు.

మృతవీరులకు నివాళి

దెందులూరు: కారంచేడు మృతవీరులకు వైఎస్సార్ సీపీ సీనియర్ నేత, ఫారెస్ట్ కార్పొరేషన్ రాష్ట్ర మాజీ డైరెక్టర్ పల్లం ప్రసాద్, పార్టీ ఎస్సీ జిల్లా అధ్యక్షుడు తేరా ఆనంద్, జెడ్పీటీసీ లీలా నవకాంతం నివాళులర్పించారు. ఏలూరు రూరల్ మండలం మానూరులో నిర్వహించిన కార్యక్రమంలో పార్టీ జిల్లా అధికార ప్రతినిధి కత్తుల రవి, ఎస్సీ సెల్ ఏలూరు జిల్లా అధ్యక్షులు తేరా ఆనంద్, మాల మహానాడు ఏలూరు జిల్లా అధ్యక్షులు గొల్ల కిరణ్ కరపత్రాలను విడుదల చేశారు.

శానిటేషన్ పనులకు జేసీబీ ప్రారంభం

ఏలూరు (టూటౌన్): పెరుగుతున్న జనాభా, నగర విస్తరణ దృష్ట్యా కార్పొరేషన్ పరిధిలో శానిటేషన్ సంబంధించి అధునాతన పరికరాలను సమకూర్చుతున్నామని ఎమ్మెల్యే బడేటి చంటి, మేయర్ నూర్జహాన్ అన్నారు. 15వ ఆర్థిక సంఘం నిధులు రూ.46 లక్షలతో కొనుగోలు చేసిన చైన్ జేసీబీని గురువారం ఉదయం కార్పొరేషన్ వెహికల్ షెడ్‌లో ఆయన ప్రారంభించారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ మామిళ్లపల్లి పార్థసారథి, కమిషనర్ ఎ.భాను ప్రతాప్, కోఆప్షన్ సభ్యులు, కార్పొరేటర్లు తదితరులు పాల్గొన్నారు.

కార్మికులకు కిట్లు అందజేత

నమస్తే డే కార్యక్రమంలో భాగంగా కార్పొరేషన్ మేయర్ చాంబర్లో అండర్ గ్రౌండ్ డ్రెయినేజీ, సెప్టిక్ ట్యాంకులపై పనిచేసే కార్మికులకు పీపీ కిట్లు, యాప్రాన్లు ఆయుష్మాన్ భారత్ ఆరోగ్య బీమా కార్డులు అందజేశారు. ఈ సందర్భంగా మేయర్ షేక్ నూర్జహాన్, కమిషనర్ ఎ.భాను ప్రతాప్ మాట్లాడారు. కార్యక్రమంలో పెదబాబు, అదనపు కమిషనర్ జి.చంద్రయ్య, ఎంఈ ఈ.సురేంద్రబాబు, కార్పొరేటర్లు సబ్బన శ్రీనివాసరావు, జిన్నూరు కనక నరసింహారావు, దేవరకొండ శ్రీనివాసరావు, కర్రి శ్రీనివాసరావు, బత్తిన విజయ్ కుమార్, కల్యకొల్లు సాంబ, పాము శ్యామ్యూల్, ఈదుపల్లి పవన్, ఉత్సల సుజాతసన్నీ పాల్గొన్నారు.